
విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్‌ను విడదల చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్ విడుదల

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో జై భీమ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావుఫూలే, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 9న రాజీవ్‌గృహకల్పలో ఆవిష్కరించనున్న జంట విగ్రహాల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్‌గౌడ్, దళిత నాయకులు జంగయ్య, పారంద స్వామి, ఎర్ర రవీందర్, గిరీష్, జైభీమ్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పనికెర కృష్ణ, మారయ్య, భాస్కర్, బాబురావు. మల్లేష్, శ్రీనివాస్, మహంత్, నవీన్ పాల్గొన్నారు.


సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం

చంపాపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గోదా రంగనాథుల కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణంలో ఆలయ చైర్మన్ శేఖర్‌రెడ్డి దంపతులు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుమిత దంపతులు, ఆలయ మాజీ చైర్మన్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై గోదారంగనాథస్వామి ఊరేగింపు

వైభవంగా పల్లకి సేవ

చాదర్‌ఘాట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని ఆండాళ్ నిలయంలో ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా గోదారంగనాథస్వామి కల్యాణ వేడుకల్లో గోదాదేవి అలంకరణలో ఇద్దరు అమ్మాయిలు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గోదారంగనాథస్వామి పల్లకి సేవ భజన కీర్తనల నడుమ అంగరంగ వైభవంగా సాగింది.


గోవత్సవ సహిత పూజా కార్యక్రమంలో పాల్గొన్న వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్‌కే మూర్తి తదితరులు

ప్రజలందరూ సుఖఃసంతోషాలతో జీవించాలి

వనస్థలిపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సుఖఃసంతోషాల తో జీవించాలని వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీ.హెచ్.వీ.ఆర్.కే మూ ర్తి అన్నారు. సంస్కారభారతి రంగారెడ్డి జిల్లా సమితి, వనస్థలిపురం భక్త స మాజం సంయుక్త ఆధ్వర్యంలో కనుమ పండుగను పురస్కరించుకుని వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో వృషభ, గోవత్స సహిత గోపూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఈ సందర్భంగా సీ.హెచ్.వీ.ఆర్.కే మూర్తి మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖః సంతోషాలతో జీవించాలన్నారు. సత్యనారాయణమూర్తి, మంగపతిరావు, అప్పారావు, రవిశర్మ, సీతారామశర్మ, కృష్ణాదిశేషు, శ్రీరామ్ పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, సతీష్‌కుమార్‌గౌడ్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న అన్నారు. బీఎన్ రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ముద్దగౌని సతీష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న హా జరై వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


ఎల్లయ్య(ఫైల్)

కొత్తపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి మన్సూరాబాద్ సాయినప్తగిరి కాలనీలో బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం, కునుముల గ్రామానికి చెందిన చుక్క ఎల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి మన్సూరాబాద్ సాయినప్తగిరి కాలనీలో ఉంటున్నాడు. ఈనెల 12న అతడు బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులను, తెలిసిన వారిని సంప్రదించారు. ఫలితం దక్కకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎల్లయ్య గులాబీ రంగు చొక్కా, నీలం రంగు నిక్కరు ధరించాడని, అతడి ఆచూకీ తెలిసిన వారు 9948344666, లేదా 8688338687 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.


వనస్థలిపురంలో పతంగులను ఎగురవేస్తున్న ప్రసిద్ధ శ్రీలక్ష్మీ గణపతి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ మిట్టా రామ్మోహన్ దంపతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి


విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి


వాకిట్లో సంక్రాంతి ముగ్గులు వేస్తున్న చిన్నారులు

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు


సైదాబాద్‌లో పతంగులను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బలాల


వీధుల్లో చెత్త వేయరాదు అనే నినాదంతో ముగ్గులు వేసిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది


టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న గోపాల్‌రెడ్డి, చరణ్‌రెడ్డి


చంపాపేట డివిజన్ మాధవనగర్‌కాలనీలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని పాలను పొంగిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్‌బీనగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అందమైన లోగిళ్లు.. చూడ ముచ్చటగా దిద్దిన రంగవల్లులు.. వాటిల్లో గొబ్బెమ్మలు.. హరిదాసుల సంకీర్తనలు.. బసవన్నల గిట్టల చప్పుళ్లు.. ఎగిరే పంతంగులు.. కలబోసి సంక్రాంతి సంబరాల ఆనవాళ్లు మంగళ, బుధవారాలలో వాడవాడలా కనిపించిన ఆనందోత్సాహాలు.. సంక్రాంతి, కనుమ పర్వదినాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మలక్‌పేట నియోజకవర్గాలలోని పలు ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఎల్బీనగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, నాగోల్, కొత్తపేట, సరూర్‌నగర్, బాలాపూర్, వనస్థలిపురం, చైతన్యపురి, పీఅండ్‌టీకాలనీ, మలక్‌పేట, సైదాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రజలు సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పం డుగను కనులపండువగా జరుపుకున్నారు. తెలుగువారి సంప్రదాయం ప్రతిబింబించేలా వాడవాడలు ముగ్గులతో కళకళలాడాయి. డప్పు నృత్యాలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటలు, పాటలతో కాలనీలు, బస్తీలు ఆహ్లాదకరంగా మారాయి. అపార్టుమెంట్లలో నివసించే వారు కలసికట్టుగా సంబరాలు జరుపుకున్నారు. చాలామంది తమ ఇళ్ల ను బొమ్మలకొలువుతో అలంకరించారు. ప్రజలు భోగి, మకర సంక్రాం తి, కనుమ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కాలనీలు, బస్తీలలోని యువజన, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో పతంగులు, ముగ్గుల పోటీలను ఘనం గా నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పతంగుల రెప రెపలు.. యువకుల కేరింతలు..

సంక్రాంతిని పురస్కరించుకుని యువకులు పతంగులను రెప రెపలాడించారు. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా గాలిపటాలు ఎగరేస్తూ మురిసిపోయారు. పతంగులు ఆకాశ వీధుల్లో రెపరెపలాడుతుంటే చిన్నారుల కేరింతల నడుమ సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. పెద్దపెద్ద భవనాలపై సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకుని యువకులు జట్లుగా ఏర్పడి పతంగుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పతంగులు ఎగురవేసే యువకుల కేరింతలతో కాలనీలు, బస్తీలు కళకళలాడాయి. కనుమ రోజైన బుధవారం ప్రజలు విందులు, వినోదాలతో ఉత్సాహంగా గడిపారు.

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలోని ప్రజలు మంగళ, బుధవారం మకర సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మకర సంక్రాంతిని పురష్కరించుకొని ఇండ్ల ముందు అందమైన రంగవల్లులు, మామిడి తోరణాలతో అలంకరించుకున్నారు. ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను ఇంటి గు మ్మాల ముందు అలంకరించుకున్నారు. మట్టి గురుగుల్లో పాలను పొంగించి సంబరాలు జరుపుకున్నారు. ఆలయాలలో ప్రజలు పెద్ద సంఖ్య లో పూజలు చేశారు. చిన్నారుల తలపై నవధాన్యాలు, రేగిపండ్లను పోసి ఆశీర్వదించి పండుగను సంబరంగా జరుపుకున్నారు. చిన్న,పెదలు గాలిపటాలను ఎగురవేశారు. బుధవారం కనుమ పండుగను ప్రజలు జరుపుకున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: సంక్రాంతి సంబురాలను అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భోగీతో ప్రారంభమైన వేడుకలను కనుమతో ముగిశాయి. మంగళవారం సంక్రాంతి రోజు మహిళలు ఇంటి ముందు కళ్లాపిచల్లి అందమైన ముగ్గులను పరిచారు. అందులో నవధాన్యాలు పోసి గొబ్బెమ్మలను పెట్టారు. మహిళలు పిండి వంటల సందడిలో మునిగిపోగా.. యువత, పిల్లలు భవనాలపై సౌండ్ బాక్సుల్లో పాటలు వింటూ గాలి పటాల ఎగువేస్తూ ఉత్సాహంగా గడిపారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో..

సరూర్‌నగర్ : సంక్రాంతి సంబరాలను మంగళవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. బుధవారం కనుమను సైతం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా మహిళలు, యువతులు, చిన్నారులు తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేయగా, యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ కనిపించారు. మీర్‌పేట, జిల్లెలగూడ, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, గుర్రంగూడ, బాలాపూర్, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, వెంకటాపూర్, మల్లాపూర్, మామిడిపల్లి, లెనిన్‌నగర్, రాగన్నగూడ తదితర గ్రామాల్లోని ప్రజలు సంక్రాంతి, కనుమ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చరణ్‌రెడ్డి తదితరులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తదితరులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మన్సూరాబాద్ : మకర సంక్రాంతి వేడుకలను మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల పరిధిలో మంగళవారం సందడిగా నిర్వహించారు. మహిళలు ఇంటి ముందు పోటాపోటీగా రంగవళ్లలను వేసి గొబ్బెమ్మలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. యువత, చిన్నారులు రంగు రంగుల పంతంగులను ఎగురవేస్తూ గడిపారు.

సైదాబాద్ : సంక్రాంతి, కనుమ వేడుకలను సైదాబాద్, మలక్‌పేట, మాదన్నపేట, పరిసరాలలో ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. చిన్నా పెద్దలు పతంగులు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. సైదాబాద్‌లో ఎంఐఎం నేతలు సుమంత్‌గౌడ్, నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో ఎమ్మెల్యే బలాల పాల్గొని పంతంగుల ఎగురవేశారు. సింగరేణి బస్తీలో సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

చాదర్‌ఘాట్ : మకర సంక్రాంతి వేడుకలను మలక్‌పేట పరిసర ప్రాంత ప్రజలు ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు పోటాపోటీగా ఇళ్ల ముందు ముగ్గులు వేసి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. యువకులతో కలిసి కుటుంబీకులు పతంగులు ఎగురవేసి సంబరాలు పంచుకున్నారు.

చిగిరింత సరోజనమ్మకు పలువురి నివాళి

● కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపిన నేతలు


చిగిరింత సరోజనమ్మకు నివాళులర్పిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నేత శంకర్‌రెడ్డి తదితరులు


సరోజనమ్మ దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి అత్త, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి మాతృమూర్తి చిగిరింత సరోజనమ్మ ఈనెల 5వ తేదీన అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. ఆమె దశదినకర్మ బుధవారం బాలాపూర్‌లోని పారిజాతానర్సింహారెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టఫ్ ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సరోజనమ్మకు ఘనంగా నివాళులర్పించారు. పారిజాతానర్సింహారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరై సరోజనమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్‌లో బడంగ్‌పేట్, మీర్‌పేట్ నేతలకు చోటు

● ఒక్కో కార్పొరేషన్ నుంచి ఇద్దరేసి సభ్యులు నియామకం


సోమేశ్వర్, జిల్లెలగూడ


కుణానిధి, మీర్‌పేట్


శివారెడ్డి, అల్మాస్‌గూడ


ప్రభాకర్, బాలాపూర్

సరూర్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బీజేపీ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రకటించిన నియామకాల్లో బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన నలుగురు నేతలకు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా చోటు దక్కింది. ఆయా కార్పొరేషన్లకు ఇద్దరేసి చొప్పున అధ్యక్షులను నియమించిన సంగతి తెలిసిందే. వారితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా సైతం ఒక్కో కార్పొరేషన్ నుంచి ఇద్దరి చొప్పున అవకాశం కల్పించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన కొండ్రు సోమేశ్వర్, మీర్‌పేట్‌కు చెందిన ముత్తంగి కరుణానిధి, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన జి.శివారెడ్డి, బాలాపూర్‌కు చెందిన జోరల ప్రభాకర్‌ను జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నియమిస్తూ పార్టీ జిల్లాశాఖ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకంతో రెండు కార్పొరేషన్లలో కలిపి మొత్తం ఎనిమిది మందికి కొత్తగా పార్టీ పదవులు దక్కినట్టయింది.

శ్రీనివాసనగర్‌లో ఇంటి తాళం పగులగొట్టి చోరీ

కొత్తపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి శ్రీనివాసనగర్‌లో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగుల గొట్టి బంగారు గొలుసు, విలువైన ఎలక్ట్రానిక్ సామగ్రి ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతే మండలం నేరడ బాయి గోపాతండాకు చెందిన కొర్ర రమేష్(29) మన్సూరాబాద్ శ్రీనివాసనగర్‌కాలనీలో ఉంటూ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఈ నెల 13వ తేదీన ఉదయం 5.30కి ఇంటికి తాళం వేసి, స్నేహితులతో కలిసి ఏడుపాయలు పిక్నిక్‌స్పాట్‌కు వెళ్లాడు. అదే ఇంట్లో రెండో అంతస్తులో ఉండే బచ్చులయ్య మరుసటి రోజు ఉదయం 6.43కు అతడికి ఫోన్‌చేసి ఇంట్లో దొంగలు పడ్డారని సమాచారం ఇచ్చాడు. అతడు ఇంటికి చేరుకుని పరిశీలించగా బీరువాలో దాచిన 3తులాల బంగారు గొలుసు, 2మొబైల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, కొంత నగదు దొంగలు ఎత్తుకుపోయినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌హెచ్‌ఓ కే.వినోద్‌కుమార్, డీఎస్‌ఐ నరేందర్, డిటెక్టివ్ టీం, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

500మంది ప్రజాప్రతినిధులను గెలిపించుకుంటాం

● బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ శేఖర్


మాయావతి జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న బీఎస్పీ నాయకులు

మన్సూరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటుకు తన 37మంది ఎంపీలతో మద్దతు పలికి పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందేలా చేసిన మాజీ ముఖ్యమంత్రి మాయావతికి తెలంగాణ ప్రజలు రుణపడి ఉన్నారని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. మాయావతి జన్మదిన వేడుకలను ఎల్బీనగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్, ప్రధాన కార్యదర్శి గుం డెల ధర్మేందర్, కార్యదర్శి జగన్‌లు విచ్చేసి మాయావతి జన్మదిన కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా ఇబ్రాం శేఖర్ మాట్లాడు తూ తెలంగాణకు మద్దతుగా నిలిచిన మాయావతికి స్థానిక సంస్థల్లో 500 మంది ప్రజాప్రతినిధులను గెలిపించి బహుమతిగా ఇస్తామన్నారు. బహుజనుల రాజ్యాధికారం కోసం నిరంతరం పాటుపడే ఏకైక పార్టీ బీఎస్పీ అని, మాయావతి నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో దేశం, రాష్ట్రంలో బీసీ, బహుజనుల రాజ్యాధికారం రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. బహుజనులకు హామీలు ఇచ్చి రాష్ట్రాన్ని పదేళ్లపాటు ఏలిన బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాల నిజస్వరూపం బట్టబయలైందన్నారు. ఇక తెలంగాణ ప్రజల ముందున్న ఏకైక ప్రత్యామ్నాయం బీఎస్పీ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్, అధ్యక్షుడు పల్నాటి రాములు, జిల్లా కార్యదర్శి నితిన్ కిశోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పటిష్టంగా అమలు చేయాలి

● జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాల అమలుపై మండల స్థాయి అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుపై అధికారులకు పలు సూచనలు అందించారు. పథకాల అమలు విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని, పటిష్టంగా అమలు చేయాలన్నారు. అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ అధికారి మధుసూదన్, వ్యవసాయ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


సింధు భార్గవి(ఫైల్)

సైదాబాద్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పూట సైదాబాద్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూకట్‌పల్లి కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసే సి.బాలకృష్ణ పెద్దకుమార్తె పసుపులేటి సింధు భార్గవి (34)కి సైదాబాద్ పూసలబస్తీలో నివాసముండే సంతోష్‌కుమార్‌తో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు, భార్గవి ప్రైవేటు సంస్థలో, సంతోష్‌కుమార్ ఫైనాన్స్ ఆఫీస్‌లో ఉద్యోగం చేసేవారు. కొంతకాలంగా సంతోష్ తాగుడుకు బానిసై ఉద్యోగాన్ని వదలివేసి ఇంట్లోనే ఉంటున్నాడు. నిత్యం మద్యం మత్తులో భార్యతో గొడవపడుతూ వేధించసాగాడు. సం క్రాంతి రోజు సాయంత్రం 4.30గంటలకు సైదాబాద్ కాలనీలోని తల్లిదండ్రు ల వద్ద మాట్లాడి వెళ్లింది. అనంతరం పూసలబస్తీలోని వారి ఇంటికి వెళ్లి రాత్రి 6.15గంటల సమయంలో బెడ్రూంలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు మృతికి ప్రధాన కారకుడు అల్లుడు సంతోష్‌కుమార్‌తో పాటు, శ్రీనివాస్, సరితలు ఉన్నారని, వారిపై చర్య తీసుకోవాలని మృతిరాలి తండ్రి బాలకృష్ణ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగం, ఆర్థిక సమస్యలతో వ్యక్తి..

చాదర్‌ఘాట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేని వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట ఆనంద్‌నగర్‌నివాసి సంజయ్(40)కి 15ఏళ్ల క్రితం వివాహమైంది. ఇతనికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. రోజువారి కూలీగా పనిచేసి జీవనం సాగిస్తున్న సంజయ్‌కి కుటుంబ భారం మోయలేక, నిరుద్యోగంతో బాధపడుతున్నాడు. మకర సంక్రాంతి రోజైన మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించాడు. బుధవారం తెల్లవారు జామున 4.30గంటల ప్రాంతంలో లేచి చూడగా ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. పిల్లలతో కలిసి తన భర్త సంజయ్‌ను కిందకు తీసిన భార్య నాగమ్మ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. క్లూస్ టీమ్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. తన భర్త సంజయ్ ఆత్మహత్యపై తమకు ఎవరిపై ఎలాంటి అనుమానాలు లేవని నాగమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. నిరుద్యోగంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆయన ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.